క్లుప్తంగా

విధుల్లో చేరుతున్న అంగన్‌వాడీలు



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అంగన్‌వాడీలు

సారవకోట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో గత నెల రోజుల నుంచి సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు ఒక్కొక్కరిగా విధుల్లో చేరుతున్నారు. ఈ ప్రాజెక్టు పరిధిలో 193 అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటికే 87 మంది విధుల్లోకి చేరారు. శనివారం బుడితి సెక్టార్‌కు చెందిన కార్యకర్తలు, సహాయకులు తాము విధుల్లోకి చేరుతున్నట్లు సంబంధిత సూపర్‌వైజర్ సుజాతకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

రహదారి పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసన్నపేట: బాలసీమ పంచాయతీ బసివలస మెయిన్ వీధిలో రూ.2 లక్షలతో రోడ్డు పనులు వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆరంగి శ్రీనివాసరావు, పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు పాగోటి గోవిందరావు శనివారం ప్రారంభించారు. రోడ్డు బాగుచేయాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ కృష్ణచైతన్య దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లటంతో నిధులు మంజూరు చేశారు. ఉప సర్పంచ్ రావాడ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈగా ఎంపిక



కోటిపాత్రుని అనిల్‌కుమార్

పొందూరు: మండలంలోని కింతలి గ్రామానికి చెందిన కోటిపాత్రుని అనిల్‌కుమార్ గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా ఎంపికయ్యారు. శుక్రవారం విడుదలైన ఏపీపీఎస్సీ ఫలితాల్లో సత్తాచాటాడు. అనిల్ కింతలి జెడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి, శ్రీకాకుళంలో పాలిటెక్నిక్, ఆంధ్రా యూనివర్సిటీలో బీటెక్ పూర్తిచేశారు. తండ్రి శ్రీరామ్మూర్తి రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి, తల్లి అరుణకుమారి గృహిణి. అనిల్‌ను స్నేహితులు, కుటుంబ సభ్యులు శనివారం అభినందించారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



మాట్లాడుతున్న క్రైమ్ డిప్యూటీ సూపరింటెండెంట్ విఠలేశ్వరరావు

ఆమదాలవలస: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని క్రైమ్ డిప్యూటీ సూపరింటెండెంట్ టి.పి.విఠలేశ్వరరావు అన్నారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి కృష్ణాపురంలో గ్రామ యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత క్రీడల పట్ల ఆసక్తి చూపించాలన్నారు. ఇలాంటి టోర్నమెంట్‌లు నిర్వహించడం వల్ల గ్రామీణ క్రీడాకారులు వెలుగులోకి వస్తారన్నారు. ఆరోగ్యవంతమైన సమాజానికి క్రీడలు దోహదపడతాయన్నారు. ఆమదాలవలస సీఐ పైడయ్య, ఎస్ఐ వై.కృష్ణ, నిర్వాహకులు సనపల అనంత్, గురుగుబెల్లి చంద్రరావు, కృష్ణాపురం గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆదర్శప్రాయుడు



హిరమండలంలో సంతకాల సేకరణ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హిరమండలం: రాష్ట్రంలోని విజయవాడ నడిబొడ్డున 25 అడుగుల ఎత్తు కలిగిన డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు దేశానికే తలమానికంగా నిలుస్తోందని మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ మీసాల వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఏపీ సురేష్ అన్నారు. ఈ నెల 19న విజయవాడలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో శనివారం మండల కేంద్రంలో సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించారు. నాయకులు నక్క ఆనందరావు, ఎస్.పాపారావు, తొనంగి తాడు, ఎస్.మురళి, జి.సురేష్, బి.శ్రీను, పి.అప్పలరెడ్డి, బి.రాము శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక ప్రారంభం

బూర్జ: మండలంలోని ఓ.వి.పేటలో ఇటీవల 15వ ఆర్థిక సంఘ నిధులతో నిర్మాణం చేపట్టిన శ్మశాన వాటికను వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు, సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ శనివారం ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి ఇసాయి వెంకటరావు, నాయకులు ప్రకాశరావు, రమణమూర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు.. సంక్రాంతి శోభ



కొత్తూరు: కొత్తూరు మార్కెట్‌లో మట్టి కుండలు కొనుగోలు చేస్తున్న మహిళలు

సంక్రాంతిని కుటుంబ సభ్యులందరూ కలిసి కట్టుగా ఆనందంగా నిర్వహించే పండగ. పట్టణాల్లో ఉన్నవారంతా పల్లె బాట పట్టారు. కుటుంబ సభ్యులు, యువతీ, యువకులు సందడి చేయడానికి సిద్ధం కావడంతో సంక్రాంతి శోభ సంతరించుకుంది. రైతులు పంట పనులను ముగించుకుని పండిన ధాన్యాన్ని విక్రయించి, వచ్చిన నగదుతో నూతన వస్త్రాలు కొనుగోలు చేసుకున్నారు. శనివారం కొనుగోలుదారులతో మార్కెట్లు, వారపు సంతలు కిటకిటలాడాయి. – సాక్షి నెట్‌వర్క్



కొత్తూరు: కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న కొత్తూరు మార్కెట్



కొత్తూరు: మండల కేంద్రంలో కొనుగోలుదారులతో నిండిన వస్త్ర దుకాణం



కొత్తూరు: పాత రెవెన్యూ కార్యాలయం ఎదురుగా ఉన్న ఎస్సీ వీధిలో భోగీ మంటకు సిద్ధంగా ఉంచిన దుంగలు



సారవకోట: మండల కేంద్రంలోని బజారు జంక్షన్లో భోగీ మంట వేసేందుకు సిద్ధం చేసిన కర్రలు



ఆమదాలవలస: కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న చింతాడ సంత



హిరమండలం: జనాలతో కిటకిటలాడుతున్న హిరమండలం మార్కెట్



నరసన్నపేట: ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రధాన రహదారిపై వాహనాల రద్దీ



నరసన్నపేట: లక్ష్మీ టాకీస్ సమీపంలోని ఫుట్‌పాత్‌పై ఉన్న వస్త్ర దుకాణాల వద్ద నెలకొన్న రద్దీ



నరసన్నపేట: కొనుగోలుదారులతో రద్దీగా ఉన్న కాలేజీ రోడ్డు

రైతుల ఖాతాల్లో రూ.153.79 కోట్ల జమ

• పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



రెడ్డి శాంతి, ఎమ్మెల్యే, పాతపట్నం

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పాతపట్నం నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని రైతుల నుంచి ఇప్పటివరకు 70,450.680 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, ఇప్పటివరకు రూ.153.79 కోట్లు వారి ఖాతాల్లో జమ చేశామని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 98 శాతం మందికి నగదు చెల్లించటం జరిగిందన్నారు. సాంకేతికపరమైన సమస్యల కారణంగా రెండు శాతం మందికి నగదు చెల్లింపులో జాప్యం అవుతుందన్నారు. పాతపట్నం మండలంలో 18 ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మెళియాపుట్టిలో 21, ఎల్.ఎన్.పేటలో 12, కొత్తూరులో 27, హిరమండలం మండలంలో 13 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. వీటి ద్వారా గ్రేడ్-ఎ రకం 22,80,545 మెట్రిక్ టన్నులు, కామన్ రకం 70347,160 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. నగదు చెల్లింపులో ఎలాంటి జాప్యం లేకుండా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి తగిన చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనం వేసినప్పటి నుంచి ధాన్యం కొనుగోలు చేసేంతవరకు ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందన్నారు. ఎరువులు, విత్తనాలు, రాయితీపై వ్యవసాయ పరికరాలు రైతుల ఇంటి వద్దకే అందిస్తున్నామని తెలిపారు. రైతులకు పెట్టుబడి రాయితీ, సున్నా వడ్డీ రుణాలు, పంటల బీమా.. ఇలా అన్ని దశల్లోనూ ప్రభుత్వం రైతులకు తగిన ప్రాధాన్యత ఇవ్వటం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో రైతుల సంక్షేమాన్ని కోరే సీఎం జగన్‌కు మద్దతుగా నిలవాలని కోరారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



మాట్లాడుతున్న ఎస్ఐ నారాయణస్వామి

హిరమండలం: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్ఐ జి.నారాయణ స్వామి హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ వద్ద శనివారం విలేకరులతో మాట్లాడారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థలాలకు చేర్చాల్సిన బాధ్యత ప్రైవేట్ ట్రక్కర్లు, ఆటోలు, బొలేరాలు వంటివి నడిపే డ్రైవర్లపై ఉందన్నారు. సంక్రాంతి నేపథ్యంలో రహదారులు రద్దీగా ఉంటాయని, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పండగ రోజుల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే చర్యలు తప్పవన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

నరసన్నపేట: స్థానిక పెద్దపేటలోని శివాలయం వద్ద నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసినట్లు చారిటీ బాక్స్ ప్రతినిధి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. 15 పేద కుటుంబాలకు సంక్రాంతి సందర్భంగా 15 రకాల సరుకులు అందజేశామన్నారు. చారిటీ బాక్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. కవిత, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

8 మద్యం సీసాలు స్వాధీనం

పాతపట్నం: ఒడిశా నుంచి మద్యాన్ని అక్రమంగా ఆంధ్రాలోకి తీసుకువస్తున్న ఇద్దరి వ్యక్తులను అరెస్ట్ చేశామని ఎస్ఐ మహమ్మద్ యాసిన్ తెలిపారు. పాతపట్నం రైల్వే స్టేషన్ సమీపంలో శనివారం పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. పొందురుకు చెందిన ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై 8 మద్యం బ్యాటిళ్లను తీసుకువస్తుండగా పట్టుబడ్డారు. బ్యాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని, ద్విచక్రవాహనం సీజ్ చేశామని ఎస్ఐ తెలిపారు.

ఇంటింటికీ అయోధ్య అక్షతలు



బూర్జ: ర్యాలీ నిర్వహిస్తున్న రామ భక్తులు



సారవకోట: అక్షతలు, చిత్రపటాలను పంపిణీ చేస్తున కమిటీ సభ్యులు

బూర్జ: మండలంలోని లక్కుపురం గ్రామంలో అయోధ్య నుంచి వచ్చిన అక్షతలు, కరపత్రాలు, అయోధ్య రామ మందిరం ప్రతిమలను రామ భక్తులు, హిందూ ధార్మిక సంస్థ, సమర సత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వీటిని శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

సారవకోట మండలంలో..

సారవకోట: ఈ నెల 22న అయోధ్య రామ మందిర ప్రతిష్ట పురస్కరించుకుని నిర్వాహణ కమిటీ సభ్యులు మండలంలోని అన్ని గ్రామాల్లో అక్షతలను శనివారం పంపిణీ చేస్తున్నారు. మండల కేంద్రంలో గ్రామ పెద్దలు, పురోహితులు ఇంటింటికీ అయోధ్య నుంచి వచ్చిన అక్షతలు, చిత్రపటాలను అందజేశారు. రామ మందిర ప్రతిష్ట రోజు ప్రతిఒక్కరూ ఐదు దీపాలను వెలిగించాలన్నారు.

వైభవంగా గోదారంగనాథుల కల్యాణం



గోదారంగనాథుల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: పట్టణంలోని శివబాలజీ ఆలయంలో ధనుర్మాస వ్రతం ముగింపు సందర్భంగా శనివారం గోదారంగనాథుల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ప్రముఖ ఆగమ శాస్త్ర పండితులు చామర్తి జగన్నాథాచార్యులు, చామర్తి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో అర్చకులు గోపినంబాళ్ల వేంకట సీతారామాచార్యుల అర్చకత్వంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను ఆలయ మండపంలో ఏర్పాటు చేసి పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. సంప్రదాయంగా కల్యాణ మహోత్సవం నిర్వహించారు. 50 మంది దంపతులు కల్యాణ మహోత్సవ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు తులసీరావు, మహేష్‌సామంత్ పాల్గొన్నారు.

పాతపట్నం ఎమ్మెల్యేను కలిసిన తిలక్



తిలక్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతిని శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ పేరాడ తిలక్ శనివారం మర్యాదపూరకంగా కలిశారు. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి చేరుకున్న తిలక్‌తో పాతపట్నం రాజకీయ పరిస్థితులపై ఎమ్మెల్యే చర్చించారు. జిల్లాలో అన్ని నియోజకవర్గాలతోపాటు, శ్రీకాకుళం పార్లమెంట్‌లో విజయం సాధించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇద్దామన్నారు.

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం



రహదారిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

• నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: నియోజకవర్గంలో ప్రధాన రోడ్లుతో పాటు లింకు రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత నిచ్చి పనులు చేపట్టినట్లు నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. నరసన్నపేట మండలం కోమర్తి– సారవకోట మండలం బద్రి వరకు 27 కిలో మీటర్ల మేరకు రోడ్డు విస్తరణ పనులు రూ.25 కోట్లతో ఆర్అండ్‌బీ శాఖ చేపట్టగా శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ మేరకు కోమర్తి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ఆర్అండ్‌బీ రోడ్లు రూ.60 కోట్లతో అభివృద్ధి చేశామని, రూరల్ రోడ్లు మరో రూ.40 కోట్లతో చేపట్టామని తెలిపారు. ప్రధాన రోడ్లన్నీ ఎంతో సుందరంగా తయారయ్యాయన్నారు. మరికొన్ని రోడ్లు చేపట్టాల్సి ఉందని, నిధులు మంజూరైనా కాంట్రాక్టులు నిర్లక్ష్యం కారణంగా పనుల్లో జాప్యం అవుతుందన్నారు. వీటిని కూడా త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, ఆర్అండ్‌బీ డీఈ సత్యనారాయణ, ఏఈ రాజశేఖర్, పీఏసీఎస్ అధ్యక్షుడు దాలినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు రాజాపు అప్పన్న, కేసీహెచ్‌బీ గుప్త, పోలాకి నర్సింహమూర్తి, పంచిరెడ్డి సత్యం, ఉంగటి రాజారావు, సురంగి నర్సింగరావు, బార్ల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుస్తుల వితరణ



పొందూరు: దుస్తులు పంపిణీ చేస్తున్న పట్టుశాలీ సంక్షేమ సంఘం ప్రతినిధులు



ఆమదాలవలస రూరల్: పేదలకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైద్యుడు సురేష్, డీసీసీబీ డైరెక్టర్ నారాయణరావు

ఆమదాలవలస రూరల్: పేదలను ఆదుకునేందుకు వైద్యులు బొడ్డేపల్లి సురేష్ ముందుకు రావడం అభినందనీయమని డీసీసీబీ డైరెక్టర్ బొడ్డేపల్లి నారాయణరావు అన్నారు. మండలంలోని కణుగులవలస, కొండపేట గ్రామాల్లో శ్రీకాకుళం సన్‌రైజ్ ఆస్పత్రి ఆధ్వర్యంలో పేదలకు శనివారం వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ పేద ప్రజలను ఆదుకునేందుకు వైద్యులు సురేష్ గ్రామాల్లో ఎన్నో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. సమాజ సేవ చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

పట్టుశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

పొందూరు: స్థానిక పట్టుశాలీ సంక్షేమ సంఘం కల్యాణ మండపంలో నిరుపేదలకు శనివారం దుస్తులు పంపిణీ చేశారు. సంక్రాంతి పురస్కరించుకొని స్థానిక పట్టుశాలీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 150 మంది పేదలకు వస్త్రాలు అందజేశారు. సంఘం అధ్యక్షుడు మలిపెద్ది శ్రీరంగనాయకులు, కోరుకొండ సాయికుమార్, బాసా ఆనందమోహన్, మాడుగుల కృష్ణారావు, బస్వా మన్మథరావు, వడగ సూర్యం, ఆట్ల మణిభూషనరావు, కోరుకొండ విజయకుమార్, చదువుల శ్యామలరావు, దున్న రామారావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు



సారవకోట: మానవహారం చేపడుతున్న ఆదివాసీలు

సారవకోట: జిల్లాలో ఉన్న నకిలీ బెంతు ఒరియాలను ఎస్టీ జాబితాలో చేర్చవద్దని మండలంలోని బొంతు జంక్షన్లో శనివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. శ్రీకాకుళంలో జిల్లాలో ఉన్న నకిలీ బెంతు ఒరియాలను ఎస్టీలుగా చేర్చవద్దని దశాబ్ద కాలం నుంచి నిరసన తెలియజేస్తున్నామన్నారు. నకిలీ ధ్రువపత్రాలతో చాలా మంది నకిలీ బెంతు ఒరియాలు ప్రభుత్వ ఉద్యోగాలు పొందారని, వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు చింతపల్లి భాస్కరరావు, ఉపాధ్యక్షుడు బెజ్జి కృష్ణారావు, మండల కో ఆర్డినేటర్ జన్ని అనిరుద్రుడు, పడాల మాధవయ్య తదితరులు పాల్గొన్నారు.

• అపూర్వ సమ్మేళనం



కింతలిలో ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు

పొందూరు: మండలంలోని కింతలి పీఎల్ఎన్‌జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1996-97లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయం సమ్మేళనం శనివారం నిర్వహించారు. 150 మంది పూర్వవిద్యార్థులు ఒకచోట కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని కుశల ప్రశ్నలు వేసుకున్నారు. ఆటపాటలతో ఆనందంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను, ఉపాధ్యాయేతర సిబ్బందిని సత్కరించారు.